క్లుప్తంగా

బదిలీపై మండలానికి 45 మంది ఉపాధ్యాయులు

రాజుపాలెం: మండలానికి 45 మంది ఉపాధ్యాయులు బదిలీపై రాగ విధుల్లో చేర్చుకున్నట్లు ఎంఈఓ మల్లికార్జునశర్మ మంగళవారం తెలిపారు. మండలంలో పనిచేస్తున్న 43 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినట్లు ఆయన తెలిపారు.

త్రైతసిద్ధాంతంపై ప్రచారం



అచ్చంపేట: త్రైత సిద్ధాంత భవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపవచ్చని, ప్రజలమధ్య ఉన్న అసమానతలను తొలగించవచ్చని సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజలలో దైవిభక్తుని నింపవచ్చని త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి హిందూజ్ఞానవేదిక, నర్సరావుపేటశాఖ అధ్యక్షుడు ఘడియం పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల గ్రామాల్లో మంగళవారం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ అనుమూడు ఆత్మల వివరం తెలుసుకొనుటవలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మముల స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సేవాసమితి సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, తవిటి అమరలింగయ్య, కుంచాల చిన్న వెంకయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, వెచ్చా రాజశేఖర్, పగడాల అశోక్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే



సత్తెనపల్లి: ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ రెంటపాళ్ల సెక్టార్ పరిధిలోని భీమవరం అంగన్‌వాడీ కేంద్రం–1 లో మంగళవారం జనభాగిదారి కార్యక్రమం నిర్వహించారు. బోధన, అభ్యాసన, నైపుణ్యాలకు సంబంధించి కృత్యాలు చేయించారు. పిల్లల సర్వతో ముఖ అభివృద్ధికి అవి ఏ విధంగా దోహదపడతాయో వివరించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ షేక్ ఆషా మాట్లాడుతూ చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల సంసిద్ధత, సాంకేతిక వినియోగం, కథలు చెప్పించడం, రంగోలి వంటి కృత్యాలు చేయించడం జనభాగిదారి ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్ యోనా, ఎంపీటీసీ సభ్యురాలు డీ.ధనలక్ష్మీ, వైఎస్ఆర్ సీపీ నాయకులు పి.పిచ్చయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.బేబీ, బి.సుధారాణి,కె. పద్మావతి, ఏ.అన్నపూర్ణ, చిన్నారులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

హిందీ టీచర్ ఆకస్మిక మృతి

అమరావతి: లింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్ ఎం.పద్మావతి(52)మంగళవారం పాఠశాలలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. తోటి ఉపాధ్యాయులు అందించిన సమాచారం ప్రకారం.. ఉదయం పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో హిందీ టీచర్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

అతిసారంతో అప్రమత్తంగా ఉండాలి

- అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది
- నియంత్రణేలక్ష్యంగా పక్షోత్సవాలు
- ఈ నెల 5 నుంచి 17 వరకు నిర్వహణ
- పిల్లల తల్లులకు ప్రత్యేక అవగాహన



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీలక్ష్మీకవిత

సత్తెనపల్లి: జూన్ నెలలోనూ ఎండలు మండుతున్నాయి. రోహిణీ కార్తె దాటి వారమైనా ఎండల తీవ్రత తగ్గక పోవడంతో వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో పాటు ప్రజలు అతిసార బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఈ నెల 5 నుంచి 17 వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల పేరుతో అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. ఎక్కువగా ఎండలో పని చేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తూ అతిసార రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉండడంతో జ్వరం, జలుబు, విరేచనాలు, వాంతులు వంటివి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పిల్లల తల్లులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు వివరిస్తున్నారు.

అతిసార బారిన పడితే ..

ఎవరైనా అతిసార వ్యాధికి గురైతే వెంటనేచల్లని ప్రదేశానికి తరలించాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరమంతా తుడవాలి. చల్లని గాలి తగిలే ఏర్పాటు చేయాలి. ఉప్పు కలిపిన మజ్జిగ , చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్, ఓవరల్ డీహైడ్రేషన్ ద్రావణం, ఓఆర్ఆర్ఎస్(ద్రావణం పట్టించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి వెంటనేనీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని వైద్యశాలలకు తరలించి వెంటనే వైద్య సేవలు అందేలా చూడాలి. పిల్లలకు విరోచనాలు అయితే ఆగిన తరువాత తల్లిపాలు నోటి ద్రావణాలు ఇవ్వాలి. పరిశుభ్రత ఎక్కువగా పాటించాలి. నిర్దేశిత మోతాదులో జింక్ మాత్రలు వేయాలి.

చేయకూడనివి ..

- తీవ్ర ఉష్ణోగ్రత ఉన్నపుడు ఎక్కువగా బయట తిరగకూడదు.
- రోడ్ల పక్క విక్రయించే చల్లని రంగుల పానీయాలు తాగకూడదు.
- రోడ్ల పక్క అమ్మే ఆహారం తినొద్దు. మాంసాహారం తగ్గించాలి.
- మద్యం సేవించ వద్దు.

చేయవలసినవి ..

- నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ తరచుగా తీసుకోవాలి.
- నిత్యం కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి.
- నలుపు , మందంగా ఉండే దుస్తులు కాకుండా లేత రంగులు, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి వాడాలి.
- ఇంట్లో గాలి ఆడేలా కటికీలు తెరచి ఉంచుకోవాలి.

పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం



ఎండా కాలంలో పెద్దలు, పిల్లలు అతిసార బారిన పడకుండా ప్రభుత్వ ఆదేశాలతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓఆర్ఎస్ శిబిరాల నిర్వహణతో పాటు ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచుతున్నాం. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం.

–యు.శ్రీలక్ష్మీ కవిత, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫణిదం

అమ్మ వృద్ధాశ్రమానికి లక్ష విరాళం



వృద్ధాశ్రమానికి రూ.లక్ష అందజేస్తున్న చారిటబుల్ ట్రస్ ప్రతినిధి భాను

పెదకూరపాడు: జనచైతన్య సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పెదకూరపాడులో నిర్మిస్తున్న అమ్మ వృద్ధాశ్రమానికి వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వంటికుంట శేషగిరిరావు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జనచైతన్యసమితి అధ్యక్షుడు స్టాలిన్ బాబు మాట్లాడుతూ ప్రార్థించే పెదవులకన్నా సాయంచేసే చేతులు మిన్న అన్న మదర్‌థెరిస్సా సూక్తులను నిజం చేస్తూ నిరుపేదలకు ఆశ్రయం కల్పిస్తున్న వృద్ధాశ్రమానికి మంచి మనస్సుతో లక్ష రూపాయలు అందించడం అభినందనీయమన్నారు. 2020లో వృద్ధాశ్రమాన్ని తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసి దాతల సహకారంతో ఇప్పుడు శాశ్విత భవనం నిర్మించుకోబోతున్నామన్నారు. కార్యక్రమంలో వట్టికుట్ట చారిటబుల్ సంస్థ ప్రతినిధి వట్టికుంట భాను, జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్‌బెన్నిబాబు, కో ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్, పంచాయతీ మాజీ సభ్యులు గుడిపూడి బాబూరావు, గోగులపాటి శ్రీనివాసరావు దారా బాలకృష్ణ, గుడిపూడి సాగర్ బాబు, తాళ్లూరి మలిఖార్జున్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటుచేసి వాటి ద్వారా నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒక బ్యాచ్ విద్యార్థిని, విద్యార్థులు తర్ఫీదు పూర్తిచేయడంతో మంగళవారం వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమిషనర్ షమ్మి మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారే శిక్షణతో పాటు ప్లేస్మెంట్స్ కూడా చూపించడం జరుగుతుందన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల ద్వారా 30 మంది ఎంపికయ్యారని, ప్రత్యేకంగా ఈ కోర్స్‌ల కోసం బయట నేర్చుకోవాలంటే సుమారుగా రూ.30 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండానే యువత కోసం అందిస్తుందన్నారు. యువతకు డిమాండ్ ఉన్న మరిన్ని కోర్సులను కూడా స్కిల్ హబ్ ద్వారా నేర్పబడతాయన్నారు. యువతకి డిమాండ్ పరంగా ఆసక్తి ఉన్నటువంటి కోర్సులకు వారి విద్యార్హతను బట్టి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. స్థానిక వలంటీర్లు ద్వారా ఎన్‌రోల్‌మెంట్ అయ్యి వారి ద్వార పూర్తి సమాచారం పొందవచ్చు న్నారు. స్కిల్ హబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశంను తప్పనిసరిగా సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జడ్.ఎస్.రామచంద్రరావు, అధ్యాపకులు, స్కిల్ హబ్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగంటివారిపాలెంలో ఉపాధి పనులపై తనిఖీ



ఉపాధి పనులపై తనిఖీ చేస్తున్న ఏపీడీ సురేంద్ర, అధికారులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఎమ్ఎస్ఆర్ఈజీఎస్ లో జరిగిన పనులపై మంగళవారం ఆశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 2వ తేదీన జరిగిన ఎమ్ఎస్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామస్తులు పనుల్లో అవకతవకలు జరిగాయని పీడీ జోసఫ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశాల మేర మాచర్ల ఏపీడీ సురేంద్ర విచారణ అధికారిగా సత్తెనపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ వెంకట నారాయణతో కలిసి విచారణ చేపట్టారు. విచారణలో గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారు పనులకు వెళ్లకుండానే తమ ఖాతాల్లో వారం రోజుల పనిదినాలకు సంబంధించి రూ.3 వేలు చొప్పున కూలీ డబ్బులు జమ అయ్యాయని చెప్పారు. గ్రామానికి చెందిన మరికొంత మంది విచారణప్రాంతానికి వచ్చి గ్రామంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అధికారులతో వాదనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేర విచారణ చేపట్టామని, ఏమైనా ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వాలంటూ అధికారులు గ్రామస్తులను కోరారు. విచారణలో ఇన్‌చార్జ్ ఎంపీడీలో శ్రీనివాసరావు, ఏపీఓ రామారావు, టీ.ఏ శ్రీకాంత్, ఫీల్డ్‌అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

పెరిగిన భూముల కౌలు



పొలంలో అరకతోలుతున్న రైతు

అమరావతి: రైతులు ప్రతిఏటా ఏప్రిల్ నెలలో తమ పంట పొలాలను దుక్కులు దున్ని ఖరీఫ్‌కు సర్వం సన్నద్ధం చేసేవారు. గత నాలుగేళ్లుగా వాతావరణం, దిగుబడి, గిట్టుబాటు ధర విషయాల్లో రైతులకు అనుకూలంగా ఉండడంతో భూముల కౌలుకు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. గతంలో పత్తి పంట వేసేపొలం రూ. 8 నుంచి 10 వేల రూపాయలవరకు, అలాగే మిరప సాగుచేసేపొలం రూ.15 నుంచి 20వేల వరకు కౌలు ఉండేవి. నేడు పత్తిపండించే పొలం ఎకరానికి రూ.10 వేలరూపాయల నుంచి రూ. 15వేల వరకు, మిరప సాగుచేసే పొటం రూ. 20 నుంచి రూ.25వేల రూపాయల కౌలు పెరిగాయి మెట్ట పొలాల రైతులను గత నాలుగేళ్ల నుంచి వాన దేవుడు కరుణించి సకాలంలో వానలు పడటం, గిట్టుబాటు ధరకూడా ఉండడంతో రైతులు పత్తి, మిరప రైతులు ఈఏడాది సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ప్రతియేటా భూముల యజమానుల నుంచి సంక్రాంతి పండుగ మొదలుకుని శివరాత్రి పండుగలోపు కౌలురైతులు పొలాలకు కౌలు నిర్ణయించి చెల్లించడం జరిగింది. రైతుభరోసాకేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందించడంతో పాటు పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర ప్రకటించడంతోపాటు ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు వ్యవసాయానికి అనుకూలంగా ఉండడంతో గతంలో వైఎస్సార్ ప్రభుత్వహయాంలో వలె వైఎస్ జగన్ ప్రభుత్వంలో కూడా వర్షాలు పడి సమృద్ధిగా పంటలు పండుతుండడంతో రైతులు కౌలు తీసుకోవడానికి ముందుకు వస్తున్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



మునగోడు హైస్కూల్‌లో విద్యాకానుక పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల హనుమంతరావు



జగనన్న విద్యాకానుక కిట్లు చేతబట్టిన విద్యార్థులతో విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ

అమరావతి: భవిష్యత్‌లో విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా అధ్యాపకుల సహకారంతో చదవాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మునగోడు జెడ్పీ హైస్కూల్‌లో నాలుగో సంవత్సరం విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాకాధికారి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మేకల హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగి వినయవిధేయలతో ఇష్టపడి చదవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్ కోసం నాలుగేళ్ళలో రూ. 60 వేల కోట్లరూపాయలు ఖర్చుచేశారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన విద్యాకానుక బ్యాగ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంకా విష్ణు, గ్రామపంచాయతీ కార్యదర్శి బిక్కి సుధాకర్ తో పాలుగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంకొండ (పెదకూరపాడు): విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని జెడ్పీటీసీ హరిప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం పంపిణీ చేసిన జగనన్న విద్యాకానుక పంపిణీ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, పాఠశాల స్థల దాత గుర్రం ప్రకాశమ్మ, ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, విద్య కమిటీ చైర్మన్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవితకు బంగారు బాటలు వేయండి

అచ్చంపేట: ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న జగనన్న విద్యా కానుకతో విద్యార్థులు బాగా చదివి భవితకు బంగారు బాటులు వేసుకోవాలని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. మండలంలోని అచ్చంపేట, కోనూరు జెడ్పీ హైస్కూల్సు, చెరుకుంపాలెంలోని ఆర్సీయం పాఠశాలలో మంగళవారం ఆయన జగనన్న కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో టెస్ట్‌బుక్స్, నోట్ పుస్తకాలు కొనుక్కునేందుకు రోజులతరబడి షాపుల వద్ద క్యూలో నిలబడి పడిగాపులు కాయాల్సి వచ్చేదని కాని ఇప్పుడు సీఎం జగనన్న విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాఠశాల తెరచిన తొలిరోజే విద్యార్థులకు కావలసిన అన్ని వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్స్‌ను పంపిణీ చేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, విద్యార్థులకు అవసరమైన జాతీయ నాణ్యతప్రమాణాలతోకూడిన బ్యాగ్, మూడు జతల యూనిఫాం, రెండు జతలసాక్స్, బూట్స్, టై, బెల్ట్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిస్టనరీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అచ్చంపేట జెడ్పీ హైస్కూలులో చదివే 1200 మంది విద్యార్థులకు ఒకేరోజు పంపిణీ చేయడమనేది చరిత్రలో లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, హెచ్‌యం చిగురుపాటి కళ్యాణి, సర్పంచ్ కంభాల వీరబాబు, సందెపోగు లక్ష్మణబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం ఉర్దు పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ జరీనాతాజ్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ జానీ, మార్కెట్ యార్డు డైరెక్టర్ భాషా, మైనార్టీ కన్వీనర్ సుభానీ,గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు

క్రోసూరు: క్రోసూరులోని మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారికోసం నాలుగవ ఏడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకానుక కిట్లు అందజేసినట్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.2400 ఖర్చు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులందరికీ కిట్లు అందజేసినట్లు తెలిపారు. అందులోభాగంగానే సీఎం జగన్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆహ్వానం మేరకు క్రోసూరుకు వచ్చి పంపిణీ చేసారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషి ఫలితంగా నియోజకవర్గంలో నాడు– నేడు పాఠశాలలు రూపురేఖలు మారుతున్నాయని , నియోజకవర్గంలో ప్రజలందరికీ అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, హేమలత, సీఆర్పీసత్తార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



నడవలేని వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్, సిబ్బంది



ఫణిదంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వేమవరపు ప్రదీప్



దేచవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవల గురించి సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేమవరపు ప్రదీప్ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ 42 మంది, హైపర్ టెన్షన్ 20 మంది, డయాబెటిస్ పదిమంది, గర్భిణీలు ఐదుగురు, బాలింతలు ఒకరు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎమ్.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు యు. వీరాంజ నేయులు, చైతన్య, ఎమ్ఎల్‌హెచ్‌పి కె. ధనలక్ష్మి, ఏఎన్ఎం పి.లక్ష్మి కుమారి, డీఇఓ డి. సుధాకర్, ఆశ కార్యకర్తలు సిహెచ్ చిట్టెమ్మ, మంజువాణి, తదితరులు ఉన్నారు. అలాగే భీమవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో పీహీయూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 107 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో జనరల్ ఓపి 16 మంది, హైపర్ టెన్షన్ 40 మంది, డయాబెటిస్ 9 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 25 మంది, గర్భిణులు ఆరుగురు, బాలింతలు ఐదుగురు, చిన్నారులు ఆరుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులతో మాట్లాడి ఆరోగ్య బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఏ.వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సుశీల ఏఎన్ఎంలు సీహెచ్ రామలక్ష్మి, విజయ్ కుమారి, హెల్త్ అసిస్టెంట్ పెండెం నటరాజ్, డీఈవో ఇజ్రాయిల్ ఆశా కార్యకర్తలు పి మరియమ్మ, వి. శారద, టి లక్ష్మి, జి పార్వతి, తదితరులు ఉన్నారు.

మొక్కపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

రాజుపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం మండలంలోని మొక్కపాడులో మంగళవారం వైద్య సేవలు అందించారు. ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేవీ కృష్ణకుమార్ 71 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 15 మందికి బీపీ, 23 మందికి షుగర్ మందులను 15 రోజులకు సరిపడ అందించారు. 13 మంది గర్భిణులకు, ఇద్దరు బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ శివమాధులు, ఏఎన్ఎంలు నాగలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ సాధిక్ హుస్సేన్, డీఈఓ చెవుల పూర్ణచంద్రరావు, ఆశా కార్యకర్తలు పార్వతి, పద్మావతి తదితరులు ఉన్నారు.

నాగవరంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరంలో మంగళవారం డాక్టర్ బాల అంకమ్మబాయి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 151 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో జెడ్పీ, రెండు ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు విజిట్ చేసి అక్కడి చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఇళ్లవద్ద ఉన్న నలుగురు దీర్ఘకాలిక రోగులకు వైద్యపరీక్షలు చేసి తగు సూచనలు చేసినట్లు వైద్యురాలు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వారంలో రెండు రోజులు ఉంటుందని, ప్రతి ఒక్క పేదరోగులు ఈ వైద్యకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఏఎన్ఎం చైతన్య, ఎంఎల్‌పీహెచ్ పి.శివపార్వతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు పీ.రమాదేవి పాల్గొని 103 మందికి వైద్యసేవలందించారు. జనరల్ వైద్యసేవలతో పాటుగా, రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యపరీక్షలు, మందులను అందించారు. కార్యక్రమంలో డీఈఓ రవితేజ, సీహెచ్ఓ శివపార్వతి, మధుబాబు, ఎమ్‌పీహెచ్ఎస్ మస్తాన్‌రావు, ఏఎన్ఎమ్‌లు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేచవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

నకరికల్లు: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలకు చేరువయ్యాక ఎందరో నిరుపేదలకు వారి స్వగ్రామంలోనే ఉచిత వైద్యసేవలు లభిస్తున్నాయని డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కుంకలగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దేచవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, షుగర్, బీపి వ్యాధిగ్రస్తులకు రక్తంలో షుగర్, బీపి, రక్తశాతం తదితర వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర సమయంలో వైద్యసలహాలు, సూచనల కోసం 104ను సంప్రదించవచ్చని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా బోధన



ముప్పాళ్ళ: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆట పాటల ద్వారా బోధన జరుగుతుందని, ఈ విధానంతో చిన్నారులలో మరింత ఆసక్తి పెరుగుతుందని సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీలత చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ సెక్టార్ పరిధిలోని కొంకావారిపాలెం అంగన్‌వాడీకేంద్రంలో జనభాగీదారీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రాలు అందించిన ప్రీస్కూల్ కిట్టు ద్వారా చేపట్టే బోధనను వివరించారు. సులభ రీతిలో ఆయా అంశాలపై చిన్నారులకు అవగాహన పెరగడంతో పాటుగా వారికి బోధనపై ఆసక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం అందిస్తూ చిన్నతనం నుంచే ఆయా అంశాలపై అవగాహన పెంచేలా ప్రభుత్వం ప్రణాళికలు అమలు పరుస్తుందన్నారు. తల్లిదండ్రులు, సంరక్షకులు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న బోధనా తీరును పరిశీలించవచ్చన్నారు. ఏసీడీపీఓ సంతోషి కుమారి బోధన చేపట్టే విదానాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంత లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త గీత, చిన్నారుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.